

వివరాలు మెయిన్‌లో

## అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 11 అక్టోబరు , 2026 | పేజీలు : 5












# ఒక్కేసి- పువ్వేసి చందమామా...

ఘనంగా ఎంగిలి పువ్వు బతుకమ్మ వేడుకలు

వాడవాడలా బతుకమ్మ సంబరాలు..ఆటపాటలతో మహిళలు సందడి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక: మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : ఆడబిడ్డల ఆత్మీయ పూల పండుగ ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా మొదలయ్యాయి. తీరొక్క పూలతో ఉదయమే కొత్త బట్టలు ధరించి బతుకమ్మను పేర్చి అందులో పసుపుతో తయారు చేసిన గౌరమ్మను మీద పెట్టి ఇంట్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళలో పట్టణం మొదలు పల్లెల వరకు ప్రధాన కూడళ్ళలో, చెరువు గట్లు, ట్యాంక్ బండ్లు, దేవాలయాల వద్ద బతుకమ్మలను పెట్టి ఆటపాటలతో ఆడపడుచులు సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడి అనంతరం దగ్గరలోని చెరువులు, కుంటలు, కాలువల్లో నిమజ్జనం చేశారు. ప్రభుత్వం బతుకమ్మ పండుగను అధికారికంగా ప్రకటించడంతో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటి పరిధితోపాటు ఆయా గ్రామాల్లో బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి, డిజె సౌండ్‌లు ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. బతుకమ్మ పండుగ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు నల్లగొండ నగరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది.ఈ సందర్భంగా నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.



## పేదల హక్కుల రక్షణకు కృషి చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అమరవీరుల పోరాట త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని పేద ప్రజల హక్కుల పరిరక్షణ కోసం, వారి సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలని మాజీ శాసనసభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మిర్యాలగూడ మండలం తడకమళ్ళ గ్రామంలో పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ రైతు సంఘం ప్రతినిధి దివంగత గౌర్ల ఇంద్రారెడ్డి 5వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జూలకంటి రంగారెడ్డి ముందుగా ఇంద్రారెడ్డి స్థూపం వద్ద పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, సీతారాములు, సైదమ్మ వెంకటయ్య, జిల్లా నగేష్, పంగా అశోక్, పుల్లయ్య, సోమయ్య, కుమ్మరి సైదులు, జానమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటాం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని జానునాయక్ తండా బిఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు రమావత్ కిషన్‌నాయక్ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై కుడిచేయి విరిగిపోవడం జరిగింది. శనివారం బిఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ పార్టీ నాయకులతో కలిసి తండాకు వెళ్ళి కిషన్ నాయక్‌ను పరామర్శించి, ధైర్యం చెప్పి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5వేలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్దిశెట్టి సత్యం, రమావత్ రమేష్‌నాయక్, జగృ బావోజీ, చెన్నగోని శివగౌడ్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** దసరా సందర్భంగా నిర్వహించే దేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని మండల సర్కిల్ సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్‌లు నిర్వహణ కమిటి సభ్యులకు సూచించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవిమాత ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆర్యవైశ్య సంఘం సభ్యులు శనివారం సిఐ, ఎస్ఐ, సర్పంచ్ యుగేందర్ రెడ్డిలకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఊరే జనార్ధన్, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్త వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దొడ్డి సుధాకర్, వీరమళ్ల వెంకటయ్య, పాంపాటి శ్రీధర్, మీర్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనకై పోరాటం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనకు, భారత రాజ్యాంగ విలువల పరిరక్షణకు నిరంతరం పోరాటం చేస్తానని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంట్ల ధర్మార్జున్ ప్రకటించారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా సూర్యాపేట జిల్లా కమిటి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన అభినందన సమావేశంలో ఆయన నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా ఎన్నో ప్రజా ఉద్యమాల్లో పాల్గొని శతృదాడులను, పోలీసు నిర్బంధాలను తట్టుకొని నిలబడ్డానన్నారు. జయశంకర్ సార్, కోదండరాం మార్గదర్శకత్వంలో సుధీర్ఘకాలం తెలంగాణ సాధన ఉద్యమంలో పనిచేసినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు నాయకులుగా అధికారం చలాయిస్తున్న వాళ్లు ఎవరు కూడా ఉద్యమంలో లేరని ఆయన విమర్శించారు. 2028 ఎన్నికల్లో తెలంగాణ జనసమితి సూర్యాపేట నియోజక వర్గం నుండి పోటీ చేసి గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు,



నాయకులు నిరంతరం క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్ మాట్లాడుతూ కార్యకర్తలను నిరంతరం అంటిపెట్టుకొని ఉండే ధర్మార్జున్ నాయకత్వంలో పనిచేయడం తమకు ఎంతో ధైర్యానిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ కిరణ్ కుమార్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ గౌడ్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు కొంచెం చంద్రకాంత్, నాయకులు కొల్లు కృష్ణారెడ్డి, బచ్చలకూరి గోపి, నాగు నాయక్, బొమ్మగాని వినయ్ గౌడ్, పొనుగోటి సూర్యనారాయణ, పరిదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అంజనపెల్లి, రాయినిపాలెం గ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి శనివారం పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముందుగా మిర్యాలగూడ డివిజన్ ఆంధ్రప్రభ ప్రతినిధి గూడెపూరి వెంకన్న మాతృమూర్తి గూడెపూరి రాములమ్మ అనారోగ్య కారణాలతో తుదిశ్వాస విడిచారని సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నేరుగా అంజనపెల్లి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ రాములమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రాములమ్మ మృతి పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ ఆ కుటుంబానికి అన్ని వేళలా తోడ్పాటుగా ఉంటామని తెలిపారు. అక్కడి నుండి బయలుదేరి మిర్యాలగూడ మండలం రాయినిపాలెం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మరణించిన మంద సైదులు భౌతికకాయాన్ని దర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంద సైదులు కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత మానసిక దారుఢ్యానికి క్రీడలు అవసరం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 12వ తేదీ నుండి 15వ తేదీ వరకు రాత్రి వేళల్లో ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహించనున్న బిఎల్ఆర్ బ్రదర్స్ గ్రామీణ కబడ్డీ పోటీల క్రీడా ప్రాంగణాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ సమగ్రంగా పరిశీలించారు. శనివారం స్థానిక ఎన్ఎస్పి క్యాంప్ గ్రౌండ్ మైదానానికి చేరుకుని టీంసిబికే ఆధ్వర్యంలో జరుగుతున్న మైదానాల సిద్ధం, లైటింగ్ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ దసరా పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలోని యువతకు, ప్రజలకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేలా ఈ గ్రామీణ కబడ్డీ క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత ఆధునిక కాలంలో యువత పలు రకాల దుర అలవాట్లు, సామాజిక మానసిక రుగ్మతలకు గురై చిన్న వయస్సు



లోనే తమ అమూల్యమైన ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ టూ టౌన్ అధ్యక్షుడు మోయిజ్, దేశిడి శేఖర్‌రెడ్డి, గొట్టిముక్కల ఝాన్సీ లక్ష్మణ్, ఫిజికల్ డైరెక్టర్ కన్నెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, బాల్తి వెంకటరత్నం, సురేందర్‌రెడ్డి, పర్వేజ్, చక్రి, సత్యం, తేజ, హమీద్, జాబీర్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భారత ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి నాయకులు ఎన్. సోమయ్య, పుప్పాల వీరన్న, రేపాక లింగయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక మహాత్మా గాంధీ రోడ్డులోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ భారత ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలను పునఃసమీక్షించాలన్నారు. ఎన్నికల కమీషన్ స్వతంత్రతను కాపాడాలని, అవకతవకలతో కూడిన సర్ ప్రక్రి



యను రద్దు చేయాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఓటు హక్కు కోల్పోయిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును నిబంధనల ప్రకారం పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో యుఎస్‌పిసి నాయకులు సిరికొండ అనిల్ కుమార్, మహేందర్, షేక్ ఉమర్, జి. వెంకటయ్య, బి. దేవేందర్, బి. ఆదం పాల్గొన్నారు.



## ఘనంగా దశాబ్ది వేడుకలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా ఏర్పాటై 10 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దశాబ్ధి పండుగ ఉత్సవాలు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సద్దల చెరువు నుండి కొత్త బస్టాండ్ వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జిల్లా ఏర్పాటైన తరువాత ఊహకందని విధంగా సూర్యాపేట అభివృద్ధి జరిగిందన్నారు. సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అహర్నిశలు కృషి చేసి జిల్లా కలెక్టరేట్, ఎస్పి ఆఫీస్, మెడికల్ కాలేజీ, ట్యాంక్‌బండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఎస్ఆర్ఎస్పి జలాలు, గురుకులాలు, నియోజక వర్గంలో 6వేల కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏలు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ ఎంపి లింగయ్య యాదవ్, మాజీ జడ్‌పి చైర్మన్ దీపిక యుగేందర్ రావు, హుజూర్‌నగర్ నియోజక వర్గ ఇంచార్జి నరసింహా రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## నేడే మిర్యాలగూడలో సెమినార్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో భారత దేశంలో ఆహార భద్రతపై ఇథనాల్ విధాన ప్రభావం అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహిస్తున్నట్లు టాప్రా జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్ చంద్ర తెలిపారు. శనివారం స్థానిక టాప్రా కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి పులి కృష్ణమూర్తితో కలిసి మాట్లాడారు. నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ పట్టణంలో 36వ జాతీయ రైతు మహాసభలు జరగనున్నాయని చెప్పారు. ఈ మహాసభల ప్రాధాన్యతను పురస్కరించుకుని మిర్యాలగూడలోని అనుధితి ఫంక్షన్ హాల్‌లో ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, అఖిల భారత కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, జిల్లా నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకుడు డబ్బికార్ మల్లేష్ తదితరులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 12న బిజెపి ధర్నా

**ప్రజాపక్షం/డిండి;** డిండి ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేస్తున్న రైతులకు సకాలంలో సాగునీరు అందకపోవడంతో సుమారు 15వేల ఎకరాల ఆయకట్టులో 3040శాతం పంటలు నష్టపోయిన పరిస్థితి నెలకొందని బిజెపి జిల్లా నాయకులు మాధవరం నరసింహా రావు, నల్గొండ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు వానం నరేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుంటే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోందని భారతీయ జనతా పార్టీ ప్రశ్నిస్తోందన్నారు. అక్టోబర్ 12న, తహశీల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి నిరసన దీక్ష.... డిండి ప్రాజెక్టులోకి నీటిని అందించాల్సిన, ఆయకట్టు రైతుల పంటలను కాపాడాలని, పంట నష్టంపై సమగ్ర అంచనా వేసి బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అక్టోబర్ 12 సోమవారం డిండి మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా, ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. బిజెపి దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ ఏటి కృష్ణ, డిండి మండల అధ్యక్షులు సైదా, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.





## జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలి

**ప్రజాపక్షం/వలిగొండ :** కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు, సీజేపీలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఢిల్లీలో నిరసన వ్యక్తం చేయడం కోసం బయలుదేరుతున్న సిపిఎం జాతీయ కార్యదర్శి ఎంఏ బేబీతో సహా జాతీయ కార్యవర్గాన్ని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కల్కూరి రామచంద్రర్, కవిడే సురేష్, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, సహాయ కార్యదర్శి నానాచర్ల రమేష్, నాయకులు కొండూరు సత్తయ్య, శీలం ఇందిర, ద్యానబోయిన యాదగిరి, పైళ్ళ సత్తిరెడ్డి, ఆలకుంట్ల నరసింహ, వేముల లక్ష్మయ్య, గంగాపురం వెంకటేష్, కోరబోయిన మహేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## సిఇసి రాజీనామా చేయాలని ఉపాధ్యాయ సంఘాల నిరసన

**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రజాస్వామ్య పరిరక్షణకు,ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పీసీ)ఆధ్వర్యంలో నకిరేకల్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్లను పెద్దఎత్తున తొలగించే cసర్e ప్రక్రియను రద్దు చేయాలని,ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు టి.నర్సింహమూర్తి,నకిరేకల్,శాలిగౌరారం మండల శాఖల అధ్యక్షులు కే.శ్రీనివాస్,ఆర్.రాకేష్‌కుమార్, నాయకులు ఎన్.భగత్,బి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

## అభయ సేవా ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మహాలయ అమావాస్యను పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అలంకార్ సెంటర్‌లో అభయ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అభయ సేవా సమితి అధ్యక్షులు తోట శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మహాలయ అమావాస్య రోజున పితృదేవతల ఆశీర్వాదం కోసం ప్రతియేటా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ రకంగా పేదల ఒకపూట ఆకలి తీర్చడం వరంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అభయ సేవా సమితి సభ్యులు గుడిపాటి సురేష్, గుండా శంకర్, బక్కవరపు శ్రీను, దేవరశెట్టి సత్యనారాయణ, గజ్జల మురళి పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో నైపుణ్యం గుర్తించి లక్ష్యం వైపు నడిపించాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** సమయం వృధా చేయకుండా విద్యార్థుల్లో నైపుణ్యం గుర్తించి లక్ష్యం వైపు నడిపించే బాధ్యత ముఖ్యమని తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ డెవలప్మెంట్ అభివృద్ధి కేంద్రం ట్రెసరర్ డి సతీష్ గౌడ్ పేర్కొన్నారు. పోచంపల్లి పట్టణంలో శుక్రవారం లీడేల్ ఇంటర్నేషన్ స్కూల్ ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత కెరీర్ సాధించాలంటే మొబైల్ ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలినీ హితవు పలికారు. తల్లిదండ్రులు మొదటి గురువులని వారి ఆకాంక్షలు నెరవేర్చేలా టీచర్స్ విద్యార్థులను మంచి నాణ్యమైన విద్యతో ప్రోత్సహించాలని సూచించారు. ఎంతో చారిత్రాత్మక ప్రాంతంలో స్కూల్ స్థాపించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఓ ప్రభాకర్ చైర్మన్ కర్నాటి శ్రవణ్ కుమార్, ప్రిన్సిపల్ కాశినాథ్ టీచర్స్ విద్యార్థులు పేరెంట్స్ ఆర్ల లింగస్వామి, సీత హరిప్రసాద్, ఆర్ల లింగస్వామి యాదవ్, మహమ్మద్ ఆజం, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఒక పూట ఆకలి తీర్చడం అభినందనీయం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మహాలయ అమావాస్య సందర్భంగా పితృ దేవతల ఆశీర్వాదం కోసం దాతలు ముందుకొచ్చి నిరుపేదల ఒకపూట ఆకలి తీర్చడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శంకర్ విలాస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మహాలయ అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. గత ఐదేళ్లుగా నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరు సేవాగుణం అలవర్చుకోవాలని అందులో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు



చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వెలుగు వెంకన్న, బండారు రాజా, చల్లా లక్ష్మికాంత్, బొల్లం సురేష్, మొరిశెట్టి రాము, నిర్వాహకులు సుమన్ వెంకన్న, గోపారపు రాజు పాల్గొన్నారు.

## బతుకమ్మ నిమజ్జనానికి ప్రత్యేక కుంట ఏర్పాటు



**ప్రజాపక్షం/చింతలపాలెం :** బతుకమ్మ నిమజ్జనానికి ప్రత్యేక కుంట ఏర్పాటు చేసినట్లు చింతలపాలెం గ్రామ సర్పంచ్ కందుల రామకోటి రెడ్డి తెలిపారు. నిమజ్జనకుంటకు చుట్టూ దీపాలు ఏర్పాటు చేసి మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చేసినట్లు చెప్పారు. శనివారం బతుకమ్మ పండుగ సందర్భంగా ఆ ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకొని బతుకమ్మ నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాంరెడ్డి, జంగాల పుల్లయ్య, రియాజ్, మస్తాన్, అవిరబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కులను కాలరాయడం మోదీకే చెల్లింది

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజా పోరాటాలను అణిచివేసే ఉద్దేశంతో ప్రజాస్వామ్య హక్కులపై ఆంక్షలు విధించడం, ప్రజా రవాణాకు అంతరాయం కలిగించడం తీవ్ర ఆందోళన కలిగించే పరిణామాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుంటి సాకులతో ఓటు హక్కును కాలరాస్తున్న ఎస్ఐఆర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ, ఇందుకు ప్రధాన బాధ్యులైన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిర్వహించతలపెట్టిన ప్రజా ఆందోళన మార్చ్‌లో పాల్గొనేందుకు వస్తున్న ప్రజలపై ముందస్తు నిర్బంధాలు విధించడం శోచనీయమన్నారు. కార్యకర్తలు, నిర్వాహకుల ఇళ్లకు పోలీసులు వెళ్లడం, వివిధ ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్య అని మండిపడ్డారు. శాంతియుత ప్రజా పోరాటాలను అడ్డుకోవడం కాకుండా ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

## ఎలిమినేటి లింగమయ్య మృతి బాధాకరం

**ప్రజాపక్షం/డిండి;** ఏఐవైఎఫ్ డిండి మండల కార్యదర్శి ఎలిమినేటి నరేష్ తండ్రి ఎలిమినేటి లింగమయ్య మృతి బాధాకరం అని ఏఐవైఎఫ్ అధ్యక్షులు ఎనమల్ల నవీన్ అన్నారు. శనివారం తవక్లాపూర్ గ్రామంలో లింగమయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లింగమయ్య మృతి




కుటుంబానికి తీరని లోటు అని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్షులు ప్రవీణ్, కోశాధికారి మధుకర్, సహాయ కార్యదర్శి బాలపీర్, గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బాబర్, ఆదిల్, కోశాధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా

**ప్రజాపక్షం/నకిరేకల్:** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు,అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుదని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.2,87,500 విలువైన చెక్కులను నారా బత్తుల గౌతమ్ సాయి,నాంపల్లి సోమయ్య, నారంచర్ల నిశాంత్ లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. అర్హులైన పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో బిసి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య,గాదగోని కొండయ్య,ఏసుపాదం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పలువురికి వీరేశం పరామర్శ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నకిరేకల్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మ,కాంగ్రెస్ పార్టీ నాయకురాలు గోలి పద్మ ను శనివారం ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. వారి వెంట బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాధగోని కొండయ్య,పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న, సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి,గాజుల శ్రీనివాస్,ప్రవీణ్,కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ,దసరాకు ఏర్పాట్లు పరిశీలన

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మున్సిపాలిటీ పరిధిలో బతుకమ్మ పండుగ,దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ముందస్తు ఏర్పాట్లను అధికారులు శనివారం ముమ్మరం చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు,మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పట్టణంలోని ప్రధాన వీధులు, బతుకమ్మ ఆడే మండపాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.ముఖ్యంగా వీధుల్లోని స్ట్రీట్ లైట్లను మున్సిపల్ ఎలక్ట్రీషియన్ సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, వెలగని లైట్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించారు.రాత్రివేళల్లో వీధులన్నీ వెలుగులతో కళకళలాడేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్,మాజీ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ గౌడ్,మాజీ కౌన్సిలర్ యాసారపు లక్ష్మి వెంకన్న,మున్సిపల్,ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల నేత కూలి రూ.3,000గా నిర్ణయం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** చేనేత కార్మికుల కూలి వార్పుకు రూ.3వేలుగా నిర్ణయించినట్లు పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు శనివారం తెలిపారు. ఈ మేరకు కరపత్ర ఆవిష్కరణ చేశారు. చేనేత కళాకారుల సమావేశంలో నేత కూలి పెంచుటకు సమష్టి నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు అంకం పాండు ప్రధాన కార్యదర్శి బొమ్మ హరిశంకర్, సహాయ కార్యదర్శి బిట్ల గణేష్, డైరెక్టర్ పోట్టబత్తిని వేణు కుమార్, వెంకటరమణ, సిల్క్ సహకార సంఘం అధ్యక్షులు చింతకింది రమేష్, మార్కండేయ స్వామి, దేవస్థానం అధ్యక్షులు సీత సత్యనారాయణ, చేనేత నాయకులు కూరపాటి బాబు, జోగు శ్రీనివాస్, గంజి చంద్రయ్య, కుడికాల దశరథ, మస్నం చిన్నయ్య, చేనేత కళాకారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.





## వీధి కుక్కలు, కోతుల బెడదతో బెంబేలు

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని గుడిబండ గ్రామంలో వీధి కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పండుగ సెలవులు కావడంతో పిల్లలంతా ఇళ్ల వద్దే ఉంటున్నారు. అయితే గ్రామంలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయో తెలియని భయానక వాతావరణం నెలకొంది. ఈ విషయాన్ని తీవ్రంగా తీసుకొని తక్షణమే పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య, గ్రామ కార్యదర్శిని ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్రీను నాయక్

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సంస్థాన్ నారాయణపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కరెంటోత్ శ్రీను నాయక్ ఏకగ్రీవంగా 2వ సారి ఎన్నికయ్యారు. శ్రీను నాయక్ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతి కోసం పనిచేస్తానని మాట్లాడారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎంపిక చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మరో 17 మందితో మండల కమిటీని ఎన్నుకున్నారు.

## నర్సిరెడ్డికి నివాళులు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలోని చౌల్లరామారం గ్రామంలో మాజీ సర్పంచ్, ఎంపిటిసి అనారోగ్యంతో శుక్రవారం మరణించగా ఎమ్మెల్యే మందుల సామేలు, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి శనివారం వేరువేరుగా పాల్గొని నర్సిరెడ్డి పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## తెలంగాణ జర్నలిస్టుల జేఏసి జిల్లా సహాయ కార్యదర్శిగా సిర మహేష్

**ప్రజాపక్షం/రామన్నపేట :** తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ (టిజెజెఏసి)యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడిగా రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన అక్షిత న్యూస్ కరస్పాండెంట్ సిర మహేష్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు తొగరి కరుణాకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్టు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుంగ చాందిని ఒక ప్రకటనలో తెలియజేశారు. నూతనంగా నియమితులైన సిర మహేష్ తక్షణమే బాధ్యతలు చేపట్టి జేఏసీ నియమ నిబంధనలను పాటిస్తూ క్రమశిక్షణతో పని చేయాలని సంస్థ చేపట్టే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.తన ఎన్నికకు సహకరించిన జర్నలిస్ట్ మిత్రులకి ధన్యవాదాలు తెలిపారు.

# అమ్మమ్మ జ్ఞాపకార్థం పాఠశాలకు భోజనశాల



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** చదువుకున్న బడి రుణం తీర్చుకుంటూ ఓ పూర్వ విద్యార్థి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని కల్మల్‌చెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి తీగల నర్సిరెడ్డి తన అమ్మమ్మ దొంతిరెడ్డి నర్సమ్మ జ్ఞాపకార్థం మూడు లక్షల రూపాయలతో నూతన భోజనశాలను సమకూర్చారు. పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న పాత భవనానికి రంగులు వేయించి, కొత్త కిటికీలు, తలుపులు అమర్చి విద్యార్థుల సౌకర్యవంతంగా కూర్చోని మధ్యాహ్న భోజనం చేసేలా అధునాతన సిట్టింగ్ సదుపాయంతో దీనిని తీర్చిదిద్దారు. నూతనంగా నిర్మించిన ఈ భోజనశాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దొంతిరెడ్డి పెద్దరామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిడమర్తి వీరబాబు, గ్రామ సర్పంచ్ బచ్చలకూరి శ్రీను, ఉప సర్పంచ్ కందుకూరి కృష్ణారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పాశం అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బి-స్మాట్ 'బెస్ట్ టీచర్' అవార్డు




**ప్రజాపక్షం/రామన్నపేట :** విద్యార్థులను క్రమశిక్షణతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ, నాణ్యమైన విద్యనందిస్తున్న రామన్నపేట మదర్ తెరిసా హైస్కూల్ ఉపాధ్యాయురాలు కె.అనిత బడ్జెట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జిల్లా స్థాయి 'ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డును దక్కించుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని 'వివేరా హోటల్'లో బిస్మాట్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అనితను శాలువాతో సత్కరించి, జ్ఞాపికతో పాటు అవార్డును ప్రదానం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా బోధనా రంగంలో తనదైన ముద్ర వేస్తూ,విద్యార్థుల అభ్యసన నైపుణ్యాలను పెంపొందించడంలో అనిత విశేష కృషి చేస్తున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తూ,పాఠశాల పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు గాను బిస్మాట్ యాజమాన్యం ఆమె సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రైవేట్ యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు,బిస్మాట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కరెంట్ కోసం రోడ్డెక్కిన అన్నదాతలు




**ప్రజాపక్షం/నడిగూడెం:** విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని మండల కేంద్రంలో గల ప్రధాన రహదారిపై శనివారం రైతులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కనీసం ఏడు గంటలు విద్యుత్ ఇవ్వట్లేదని, తాము లక్షల్లో పెట్టుబడి పెట్టి కళ్లముందే పంట పొలాలు ఎండిపోతుంటే బాధేస్తుందని రైతులు వాపోయారు. విద్యుత్ కోతలకు నిరసనగా రైతులు తమ మెడలో విద్యుత్ వైర్లు వేసుకుని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ తేజస్విని హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని రైతుల సమస్యలను స్థానిక విద్యుత్ ఎఈ వెంకట గణేష్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎఈ ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక సమస్యల వల్ల కరెంట్ సప్లైలో కోతలు విధిస్తున్నామని మంగళవారం నాటికి విద్యుత్ సమస్యలను అధిగమించి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు నక్కా సైదులు, గుండు శ్రీను, దున్న ప్రవీణ్, ఎస్‌కె జలీల్, బెల్లంకొండ సత్యనారాయణ, జాన్ షరీఫ్, గునుగుంట్ల పోతురాజు, చిమట వీరబాబు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలంలోని చందేపల్లి గ్రామనికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుదిపాల బస్వారెడ్డి మరణించడంతో బస్వారెడ్డి భౌతికకాయానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వంగపల్లి పిఏసిఎస్ చైర్మన్ నెమ్మాని సుబ్రహ్మణ్యం, చందేపల్లి గ్రామ సర్పంచ్ బొట్ల నాగేష్, పిఏసిఎస్ డైరెక్టర్ బొల్లేపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బొట్ల సంజీవ, నాయకులు సూదగని జయరాములు, ఆంజనేయులు, శ్రీనివాస్, కందారపు కిష్టయ్య, సూదగని శ్రీకాంత్, నవీన్, గంగరాజు మహేష్, యనాల శ్రీకాంత్, గంగరాజు వేణు పాల్గొన్నారు.



## నేటి నుంచి శరన్నవరాత్రులు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** శరదృతువు సోయగాలు,పూల పరిమళాలు, విద్యుద్దీపాల వెలుగుల నడుమ అమ్మవారి నామస్మరణతో పల్లెలు, పట్టణాలు పులకించనున్నాయి. శక్తి స్వరూపిణి దుర్గాదేవి కొలువుదీరే శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివి ధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించనున్నారు.ఇందుకోసం ఆలయాలు, మండపాలు ముస్తాబవుతున్నా యి. మండపాల నిర్మాణం, విద్యుద్దీపాల అలంకరణ, పూల సుందరీకరణ,అమ్మవారి విగ్రహాల ప్రతిష్ట, భక్తులకు సౌకర్యాల కల్పన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నవరాత్రుల్లో పలువురు భక్తులు మాలధారణ చేసి దీక్షలు చేపట్టనున్నారు.ఆలయాల్లో అభిషేకాలు, కుంకుమార్చనలు,హారతులు,భజనలు నిర్వహించనున్నారు.



## కేసులు పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వార్షిక తనిఖీల్లో భాగంగా మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను డిఎస్పీ జి.రవి శనివారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను సమగ్రంగా పరిశీలించి కేసుల పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. కేసులు ఏవీ పెండింగ్‌లో ఉండకూడదని, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విచారణను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పోలీసు కవాతును పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు, బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం, ప్రభుత్వ పథకాల లబ్ధి అందుతుందా లేదా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజలకు నమ్మకాన్ని కలిగించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ పిఎన్డి ప్రసాద్, ఎస్ఐ ఎం. లక్ష్మయ్య, స్టేషన్ సిబ్బంది, ఇతర పోలీసు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచుల ఆత్మగౌరవం బతుకమ్మ



**ప్రజాపక్షం/కోదాడ:** బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రకృతి ఆరాధనకు, పూల సౌందర్యానికి ప్రతీక, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యమత్యం, స్త్రీల సృజనాత్మకతను చాటిచెప్పే అద్భుతమైన పండుగ బతుకమ్మ అని మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ అన్నారు. శనివారం కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో కోదాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళ మణుల అందిరికి బతుకమ్మ పండుగ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కౌన్సిలర్ వంగూరి గోపి, కొల్లు చత్రయ్య, మందలపు శేషయ్య, మైలారిశెట్టి భాస్కర్, మల్లె కొండలు, రత్నకుమార్, రామచందర్‌రావు పాల్గొన్నారు

## జనగణనను ఒబిసిలు బహిష్కరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** 2027 జనవరి 10 నుంచి ప్రారంభం కానున్న జనగణన రెండో దశను ఓబీసీలంతా సంపూర్ణంగా బహిష్కరించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఢిల్లీలో ఆయన నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీలను లెక్కించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోసపూరిత వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. ఓబీసీల గణన చేపట్టకుండా జనగణన నిర్వహిస్తే రాబోయే రోజుల్లో ఆ పార్టీకి తగిన పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.ఇప్పటికే ఓబీసీల అధికారిక జనాభా లెక్కల వివరాలు అందుబాటులో లేకపోవడం వల్ల వారికి రావాల్సిన ఫలాలు, వాటా పూర్తిగా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీలకు చట్టబద్ధంగా దక్కాల్సిన హక్కులు రావాలంటే కచ్చితంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కులగణన జరిగితేనే విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచడానికి ఎలాంటి న్యాయపరమైన ఆటంకాలు ఉండవని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచించి ఓబీసీ కులగణనకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు







**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఎంగిలి పువ్వు బతుకమ్మ సందర్భంగా శనివారం సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తన నివాసంలో మహిళలతో కలిసి బతుకమ్మను పేర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకని అన్నారు. పట్టణంలోని మహిళలందరూ ప్రశాంత వాతావరణంలో బతుకమ్మ వేడుకను జరుపుకోవాలని కోరారు. ఇందుకోసం మున్సిపాలిటి తరపున అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆధరించే అపురూపమైన పండుగగా ప్రసిద్ధి గాంచిందన్నారు. ఆడపడుచులందరికి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాపక్షం/నకిరేకల్:** తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఉయ్యాల పాటలతో ఆడపడుచులు సంబురాలు చేసుకున్నారు.ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు శనివారం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి .ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం నివాసంలో ఆయన కుటుంబ సభ్యులు బతుకమ్మను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతిక బతుకమ్మ అని నేరేడుగొమ్ము ట్రైబల్ వేల్ఫేర్ పాఠశాల ప్రిన్సిపల్ పద్మ అన్నారు. శనివారం నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని స్థానిక ట్రైబల్ వేల్ఫేర్ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్/నేరేడుచర్ల:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకని కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎంగిలి పువ్వు బతుకమ్మ సందర్భంగా తన నివాసంలో తల్లి, చెల్లి, బావ, అతని సతీమణి, కూతురుతో కలిసి బతుకమ్మను పేర్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆడపడుచులందరికి ఎంగిలిపువ్వ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ డివిజన్‌లోని వివిధ మండల కేంద్రాలు, గ్రామాలు, పట్టణంలోని వాడవాడలా ఎంగిలి పూల బతుకమ్మతో తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం, గాయత్రి గేటెడ్ అవెన్యూ, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణం, రెడ్డి కాలనీ కోదండరామాలయం, ఈదులగూడ, ఎన్‌ఎస్పి క్యాంపులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మహిళలు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. కొంతమంది మహిళలు భారీ బతుకమ్మలను పేర్చి ప్రత్యేకంగా రిక్షాల్లో తీసుకవచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బి. మాధవి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్







సతీమణి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, గ్రామీణాభివృద్ధి ఎపిడి గార్లపాటి జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి/ మునుగోడు :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతిక అయిన బతుకమ్మ వేడుకలను శనివారం మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రమౌళీశ్వర దేవాలయంలో, శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాలలో ఆడపడుచులు ఘనంగా నిర్వహించారు.

**ప్రజాపక్షం/మోతె :** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో శనివారం ఎంగిలి పువ్వు బతుకమ్మ పండుగను ఆడపడుచులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి. అనురాధ, మహిళలు కళమ్మ, పద్మ, భద్రమ్మ, అంకమ్మ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రపంచంలో తెలంగాణ ఆడపడు





చుల పండుగగా బతుకమ్మ నిలిచిపోయిందని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. అర్వపల్లి గ్రామ సర్పంచ్ చిల్లంచెర్ల విద్యాసాగర్ వివిధ గ్రామాల సర్పంచులు బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని శనివారం పట్టణంలోని దేవరకొండ రోడ్ లో



గల సందీప్ హైస్కూల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాందీప్ పాఠశాల వ్యవహర్త జి. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతు తమ పాఠశాలలో ప్రతి ఒక్క పండుగ కార్యక్రమాన్ని నిర్వహించి మన తెలుగు సాంప్రదాయాలను నేటి విద్యార్థులు నేర్చుకొని భవిషత్తులో కొనసాగించాలని చెబుతు సాందీప్ పాఠశాల ఎల్లప్పుడ విద్యార్థుల లో నూతన ఉత్సాహన్ని నింపి మంచి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.

**ప్రజాపక్షం/రామన్నపేట :** మండల కేంద్రంలోని వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్లో శనివారం తెలంగాణ సంసకృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ అస్మా, ఉపాధ్యాయులు సుధా










రాణి, అనిత, రాజేశ్వరి, సునీత, శాంతి, రేష్మ, సింధు, సాహితి, సరిత, ధనలక్ష్మి , నాగరాణి, వి.మమత, అంజలి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/రామన్నపేట/ఆత్మకూర్ (యం) :** మండల పరిధిలోని బోగారం గ్రామంలో శనివారం 'ఎంగిలిపూల బతుకమ్మ' వేడుకలు ఎంతో ఉత్సాహంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంసకృతి, సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే బతుకమ్మ పండుగ మొదటి రోజు కావడంతో గ్రామంలో కోచ్న సంబరాలు అంబరాన్నంటాయి.



